# ఏడాది చివర్లో 'కల్కి2' మొదలు



ప్రభాస్ 'కల్కి 2898ఏడీ' ప్రపంచవ్యాప్తంగా 1200కోట్ల వసూలు చేసింది. ఫ్రాంచైజీలో ఏ తొలి పార్ట్‌కూ ఇంత కలెక్షన్ రాలేదు. ఆ విధంగా 'కల్కి 2898ఏడీ' ఆలిండియా రికార్డ్. తొలి పార్టే ఇంత వసూళ్లను రాబడితే.. ఇక మలి పార్ట్ రిలీజైతే పరిస్థితేంటి? అనేది అటు ప్రభాస్ అభిమానుల్లోనూ, సినీ విశ్లేషకుల్లోనూ నలుగుతున్న ప్రశ్న. ఇప్పటికే ఈ సినిమా సీక్వెల్‌పై అంచనాలు ఆకాశంలో ఉన్నాయి. కొత్త కొత్త పాత్రలు కథలో ఎంట్రీ ఇచ్చాయి. భైరవ(ప్రభాస్).. కర్ణుడిగా తెరపై సాక్షాత్కరించాడు. కురుక్షేత్రంలో అర్జునుడిగా దేవరకొండ విజయ్ తళుక్కున మెరిశాడు. సుప్రీమ్ యాస్కిన్‌గా కమల్ క్లైమాక్స్‌లో విశ్వరూపం చూపించేశాడు.. ఇక అశ్వత్థామ సంగతి సరేసరి. సెకండ్ పార్ట్‌లో ఈ పాత్రలు చేసే విన్యాసాలు ఎలా ఉంటాయి? అనే ఊహే రోమాంచితం చేస్తున్నది. ఇప్పటికే సెకండ్ పార్ట్ షూటింగ్ కూడా 40శాతం పూర్తయ్యిందని దర్శకుడు నాగ్‌అశ్విన్ ఓ సందర్భంలో చెప్పాడు కూడా. రీసెంట్‌గా ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్‌ని నాగ్‌అశ్విన్ మీడియాకు వెల్లడించారు. అన్నీ కుదిరితే.. ఈ ఏడాది చివర్లో 'కల్కి2' షూటింగ్ మొదలుపెట్టనున్నట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రభాస్ ఫౌజీ, ది రాజాసాబ్ షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు. ఆ తర్వాత ఆయన సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' సెట్‌లోకి ఎంట్రీ ఇస్తారు. ఈ మూడూ అయ్యాక ఆయన 'కల్కి2' చేస్తారా? 'సలార్2' మొదలుపెడతారా? అనే మీమాంస జనాల్లో ఉంది. నాగ్‌అశ్విన్ ప్రకటనతో 'కల్కి2' విషయంలో క్లారిటీ వచ్చేసింది.



## మృగమల్లే మారి దిగజారిపోయావు..

వినోద్‌వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నోబడీ' ఉపశీర్షిక. 'పేపర్‌బాయ్' ఫేమ్ జయశంకర్ దర్శకుడు. శనివారం ఈ సినిమా నుంచి 'భగ భగ..' అనే లిరికల్‌సాంగ్‌ను విడుదల చేశారు. అనూప్‌రూబెన్స్ స్వరపరచిన ఈ పాటను వనమాలి రచించారు. 'మనిషేనా నువ్వు, ఏమై పోతున్నావు, మృగమల్లె మారి దిగజారి పోయావు, భగ భగ భగ మండే నీలో ఏదో సెగ, అంతులేని ఏంటి దగా..' అంటూ మనిషిలోని క్రూరత్వాన్ని ప్రశ్నిస్తూ సాగిందీ పాట. అరిషడ్వర్గాలను మనిషి ఎలా జయించాలనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను రూపొందించామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాతలు: శ్రీనివాస్ రామిరెడ్డి, తిమ్మప్ప నాయుడు, సమర్పణ: ఆర్‌వీ రెడ్డి, రచన-దర్శకత్వం: జయశంకర్.



## కన్నులలో వెన్నెలలే కురిసే..

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా, దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న రొమాంటిక్ లవ్‌స్టోరీ 'ది గర్ల్ ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. అల్లు అరవింద్ సమర్పణలో రూపొందుతోన్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. శనివారం రష్మిక పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ ఈ సినిమాకు చెందిన పోస్టర్‌ని, 'రేయి లోలోతులా..' అంటూ సాగే టీజర్ సాంగ్‌ని విడుదల చేశారు. నడుముకి వేళ్లాడుతున్న గన్, చేతులో కత్తి.. మొత్తంగా ఓ వారియర్‌లా రష్మిక ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నది. ఇక 'రేయి లోలోతులా..' పాట విషయానికొస్తే.. రాకేందు మౌళి రాయగా, హేషమ్ అబ్దుల్ వాహబ్ స్వరపరచి, చిన్మయితో కలిసి ఆలపించారు. అగ్ర హీరో విజయ్ దేవరకొండ వాయిస్ ఓవర్‌తో ఈ పాట మొదలవ్వడం విశేషం. 'రేయి లోలోతుల సితార.. జాబిలి జాతర.. కన్నులలో వెన్నెలలే కురిసే.. మదిమోసే తలవాకిట తడిసే.. యద జారెనే మనసు ఊగెనే.. చెలి చెంత లో జగమాగెనే.. యద జారనే మనసా..' అంటూ ఫీల్‌గుడ్‌గా ఈ పాట సాగింది. త్వరలో విడుదల కానున్న ఈ సినిమాకు కెమెరా: కృష్ణన్ వసంత్, నిర్మాణం: గీతా ఆర్ట్స్, మాస్‌మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్మెంట్స్.

## అందాల శిల్పి ఎవరో..



గత కొంతకాలంగా వరుస విజయాలతో జోష్‌మీదున్నారు యువ హీరో శ్రీవిష్ణు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'సింగిల్'. కార్తీక్‌రాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. మే 9న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభించారు. 'శిల్పి ఎవరో' అంటూ సాగే రొమాంటిక్ గీతాన్ని విడుదల చేశారు. విశాల్ చంద్రశేఖర్ స్వరపరిచిన ఈ పాటకు శ్రీమణి సాహిత్యాన్ని అందించారు. తన జీవితంలో ప్రత్యేకమైన ఇద్దరమ్మాయిల వ్యక్తిత్వాన్ని, అందాన్ని వర్ణిస్తూ కథానాయకుడు ఆలపించే ఈ పాట చక్కటి ఫీల్‌తో సాగింది. వినోదభరితంగా సాగే రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాతలు: విద్యా కొప్పినీడి, భానుప్రతాప్, రియాజ్ చౌదరి, రచన-దర్శకత్వం: కార్తీక్‌రాజు.

# 'మహాకాళి'తో టాలీవుడ్ ఎంట్రీ



దేశవ్యాప్తంగా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన 'ఛావా' చిత్రంలో ఔరంగజేబు పాత్రలో అద్భుతమైన విలనీ పండించి ప్రేక్షకుల్ని మెప్పించారు సీనియర్ నటుడు అక్షయ్‌ఖన్నా. తాజాగా ఆయన తెలుగు సినీరంగంలోకి అడుగుపెడుతున్నారు. ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కించే 'మహాకాళి' సినిమాలో అక్షయ్‌ఖన్నా కీలక పాత్రను పోషించబోతున్నారు. భారతీయ పౌరాణిక ఇతివృత్తాలను సూపర్‌హీరో కథలతో మేళవించి దర్శకుడు ప్రశాంత్‌వర్మ తన సినిమాటిక్ యూనివర్స్‌లో చిత్రాల్ని తెరకెక్కిస్తున్నారు. అందులో భాగంగా రాబోతున్న మూడో చిత్రమే 'మహాకాళి'. ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో ప్రకటిస్తామని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి నిర్మాణ సంస్థ: ఆర్‌కేడీ స్టూడియోస్, షోరన్నర్: ప్రశాంత్‌వర్మ.



## ఈ పరిస్థితి ఎప్పటికీ ఉంటుందనుకోను..

'సౌత్ నుంచి ఒక 'బాహుబలి' వస్తుందని బాలీవుడ్ ఎప్పుడూ ఊహించి ఉండదు. ఆ వరుసలోనే ఎన్నో అద్భుతాలు సౌత్ నుంచి రావడంతో బాలీవుడ్ కాస్తంత నెమ్మదించిన మాట వాస్తవం' అన్నారు టాలీవుడ్ అగ్రహీరో విజయ్ దేవరకొండ. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సౌత్ సినిమా ఘనత గురించీ, బాలీవుడ్ సినిమా ప్రస్తుత పరిస్థితి గురించి ఆసక్తికరంగా ఆయన మాట్లాడారు. ఇంకా చెబుతూ 'సినిమా ఇండస్ట్రీ సర్కిల్ లాంటిది. ఇక్కడ పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. ఒకప్పుడు బాలీవుడ్ ఓ వెలుగు వెలిగింది. సౌత్ సినిమానైతే పట్టించుకునే వారు కాదు. కానీ ఇప్పుడు సౌత్ సినిమా రాజ్యమేలుతోంది. బాలీవుడ్ కళతప్పింది. అయితే.. ఈ పరిస్థితి ఎప్పటికీ ఉంటుందని అనుకోను. రానున్న ఐదారేళ్లలో మళ్లీ పరిస్థితులు మారొచ్చు. కొత్త డైరెక్టర్లొచ్చి బాలీవుడ్ స్థాయిని పెంచొచ్చు. అయితే.. అది సౌత్ డైరెక్టర్ల వల్లే జరుగుతుందని నేననుకుంటున్నా ' అని అభిప్రాయపడ్డారు విజయ్ దేవరకొండ.

## అది సరైన పద్ధతి కాదు



'ఇటీవల ఓ తమిళ సినిమా ఒప్పుకున్నా. ఆడిషన్‌కి రమ్మంటే వెళ్లా. తీరా ఆడిషన్ అయ్యాక.. ఆ పాత్రకు నా వయసు సరిపోదని, మరీ చిన్నదానిలా ఉన్నానని, నన్ను తిరస్కరించి, నాకంటే పెద్ద వయసుగల నటిని తీసుకున్నారు. సినిమా ఒప్పుకున్న తర్వాత.. పాత్రకు సరిపోలేదని తప్పించే బదులు.. ముందే ఆడిషన్ చేస్తే బావుండేది కదా?..' అంటూ ప్రశ్నించింది టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. ఇంకా చెబుతూ 'నేను ఎంత పెద్ద స్టార్‌ని అయినా కానివ్వండి. ఆడిషన్‌కి పిలిస్తే వెళతా. అసలు నన్నడిగితే.. పాత్రధారుల్ని ఎంచుకునే ముందు ఆడిషన్ చేయడం కరెక్ట్. పాత్రల్లో దమ్ము ఉన్నప్పుడు సదరు ఆర్టిస్ట్‌కి చేయగల సత్తా ఉందా.. లేదా అనేది తెలుసుకునేందుకు ఆడిషన్ అవసరం. అయితే అది అడ్వాన్స్ ఇవ్వక ముందే జరగాలి. ఇచ్చాక ఆడిషన్ చేసి తీసేయడం సరైన పద్ధతి కాదు. కథ కూడా చెప్పకుండా, ఫలానా హీరో సినిమా అనేసి, అడ్వాన్స్ ఇచ్చేసి కొందరు వెళ్తుంటారు. అప్పుడే అర్థమైపోతుంది.. ఆ పాత్రలో చేయడానికి ఏమీ ఉండదని. ఆడిషన్‌కి పిలిస్తే.. అది కచ్చితంగా మంచి పాత్రే అయ్యుంటుంది. అందుకే ఎవరు ఆడిషన్‌కి రమ్మన్నా వెళ్లిపోతుంటా. కానీ వాళ్లేమో ఇలా బిహేవ్ చేస్తుంటారు.' అంటూ బాధను వ్యక్తం చేసింది పూజా హెగ్డే.











